

# ఖురాన్ చర్చనీయాంశం

## (The subject of the Qur'an)


Author

Javed Ahmad Ghamidi

Translation

Mushtakh Ahmad Abhilash

**'తన ప్రతిపాదిత సత్యాలను అంగీకరించిన కారణంగా తప్పనిసరయ్యే బాధ్యతలను పరిపూర్తి చేయటంపైనే మనిషి శాశ్వత సాఫల్యం ఆధారపడి ఉంది'** అన్నదే ఖురాన్ చర్చనీయాంశం. ఈ విషయాన్ని ఒక సాధారణ ఖురాన్ పాఠకుడు సైతం అత్యంత సులువుగా గ్రహించగలడు. అది అవే సత్యాలను మనిషి అస్తిత్వం (అంఫుస్), అతని బయటి ప్రపంచం (ఆఫాఖ్) మరియు చరిత్ర (తారీఖ్) ఇచ్చే సాక్షాలతో నిరూపిస్తుంది. వాటిని విశ్వసించమని యావత్ మానవాళిని ఆహ్వానిస్తుంది. ఇంకా వాటిని తిరస్కరించటం వలన సంభవించే దుష్పరిణామాల గురించీ అప్రమత్తం చేస్తుంది. దాని ప్రబోధనల్ని అంగీకరిస్తే తప్పనిసరయ్యే బాధ్యతల వివరాలు, స్పష్టతలు ఇస్తుంది. అవి తప్ప మరే విషయాలతోనూ దానికి సంబంధమే లేదు. ఒకవేళ అది తన దృక్పథాన్ని వివరించేటప్పుడు భౌతిక ప్రపంచానికి చెందిన ఏదైనా విషయాన్ని ప్రస్తావించినా, దాని వాదన ఎన్నటికీ సత్య విరుద్ధంగా ఉండదన్నది నిస్సందేహం. అయితే విజ్ఞానశాస్త్రం, కళలు వగైరా వంటి ఏ లౌకిక విషయాలను మానవ బుద్ధి అన్వేషించిందో ఇంకా అన్వేషించనుందో వాటి గురించి ఖురాన్ ఎన్నడూ ప్రస్తావించదు. ఆవిధమైన ఏ విషయమూ దాని చర్చనీయాంశమే కాదు.

28-06-21

అయితే ఈ ముస్లిం సమాజం (ఉమ్మత్) తన చరిత్రలో ఖురాను గ్రంథాన్ని దాని వాస్తవ రూపంలో అంగీకరించటానికి సిద్ధం కాలేదు. ఖురాన్ అల్లాహ్ గ్రంథం కనక సకల భౌతిక విద్యలు, కళలు అందులో ఉండటం అనివార్యం అని కొందరు వాదించారు. దాని తరువాత వారు తమ ఈ వాదనను నిరూపించుకోవటానికి వాటికి సంబంధించిన మూలాలను వెతికి పట్టుకోవాలని దాని వాక్యాల వెంటపడ్డారు. ఈ క్రమంలో దాని భాష (జబాన్), ప్రసంగం (బయాన్), గ్రంథ క్రమం (నజ్మె కలాం) సంబంధిత విషయాల ప్రతి ఆధారాన్నీ నిర్లక్ష్యం చేసి, ఒకసారి గ్రీకు తాత్విక మూఢనమ్మకాలు దీనితో నిరూపించే ప్రయత్నం జరిగింది. మరొకసారి ఒక ప్రత్యేక కాలానికి చెందిన భౌతిక విజ్ఞానశాస్త్ర సమాచారానికి చెందిన విషయాలు ఆయా వాక్యాల నుండి గ్రహించబడ్డాయనే వాదనలు జరిగాయి. అలాగే వైద్య, జాతక, ఖగోళ శాస్త్ర సంబంధిత విషయాలను దీని నుండి లాగే ప్రయత్నం జరిగింది. ఇంకా అణు బాంబును తయారు చేసే, చంద్రుని అధిరోహించే ప్రస్తావన దీని నుండి తీసే ప్రయత్నమూ జరిగింది!

వారి ఈ ప్రయాస అంతటికీ కారణం ఈ గ్రంథం విషయంలో వారు పూర్తిగా తప్పుడు భావన ఏర్పరచుకోవటమే. విశ్వకర్త అయిన అల్లాహ్ ఈ ‘**ఖురాను గ్రంథం**’ కంటే ముందు మనిషికి ‘**బుద్ధి**’ని ప్రసాదించాడు. ఈ గ్రంథం ఏవిధంగా అయన బహుమానమో అదేవిధంగా బుద్ధి కూడా ఆయన బహుమానమే. ఈ విషయం వారికి తెలియదు. కనక ఏ విషయాల్లో అతనికి బుద్ధి మార్గదర్శకం సరిపోతుందో వాటిలో ఈ గ్రంథంతో ఏవిధమైన సంబంధమూ లేదు. ఇక వేటి గురించి ఈ గ్రంథం వాదిస్తుందో వాటి విషయంలో ఒకవేళ బుద్ధి సక్రమంగా పని చేస్తుంటే దాని మార్గదర్శకత్వాన్ని ఎన్నడూ తిరస్కరించజాలదు.

ఇది కేవలం ఖురాన్ గ్రంథం వ్యవహారమే కాదు, తన విషయంలో కూడా ప్రవక్త ముహమ్మద్ ఈ వాస్తవికతను తనను అంగీకరించే వారికి ఎంతో స్పష్టంగా వివరించి ఉన్నారు. ఉదాహరణకి:

ఒకసారి కొందరు ఖజ్జూరం మొక్క అంటుకట్టటాన్ని చూచి, ప్రవక్త ముహమ్మద్– "**అలా చేయకపోతేనే మంచిది**" అని అన్నారు. అందుకు వారు ఆ సంవత్సరం అలా చేయలేదు. పర్యవసానంగా దిగుబడి రాలేదు. ప్రజలు ప్రవక్తతో ఈ విషయాన్ని ప్రస్తావిస్తే, వారు– "**మీరు ఇలాంటి విషయాలను నాకంటే బాగా అర్థం చేసుకోగలరు**" అని అన్నారు. ఇంకా– "**నేనైతే దైవ ధర్మాన్ని చూపటానికి వచ్చాను. కనక ఆ విషయంల్లోనే నాతో సంప్రదించండి**" అని ప్రవక్త అదేశించినట్లు విశ్వాసుల మాత్రుమూర్తి అయిన సయ్యిదా ఆయిషా తెలియజేస్తున్నారు.

–సహీహ్ ముస్లిం, 6126/6128

మనం ఒకవేళ ఖురాన్ నుండి నిజంగానే మార్గదర్శకం పొందాలనుకుంటే కేవలం ధార్మానికి చెందిన సత్యాలను, వాస్తవాలను తెలుసుకోవటానికి మాత్రమే దానిని సంప్రదించాలి. మనం నిద్రించే మంచం తయారు చేయటానికి, మన గళాన్ని శుక్ర, అంగారక గ్రహాలకి చేరవేయటానికి మన తెలివితేటలను ఉపయోగించాలి. మానవుడిని తన కార్యపరిధిలో ఎన్నడూ నిరాశ పడే పరిస్థితి సర్వేశ్వరుడైన అల్లాహ్ కలిగించ లేదన్నది ఒక వాస్తవం.

28-06-21

ఒక వ్యక్తి; తన పరిపోషకుడైన అల్లాహ్ ప్రసన్నత పొందటానికి ఈలోకంలో ఏ విషయాలను అంగీకరించి, ఏ విషయాలపై ఆచరణ చేయాలన్నది తెలపటానికే ఈ ఖురాను గ్రంథం అవతరించింది. ఆయన గ్రంథంలో మనం కోరుకున్న విషయం చదవటానికి బదులు, మన కోరికలను ఆయన ఆదేశాల అనుసరణ కొసం సంసిద్ధం చేయటానికి అధ్యయనం చేయాలి. ఖురాను ద్వారా మార్గదర్శకం పొందే మొదటి షరతు ఇదే అని అల్లాహ్ అనేక సందర్భాల్లో విశదం చేసి ఉన్నాడు. సకల విద్యలను, కళలను ఈ ఒక్క గ్రంథంలోనే దర్శించాలన్న కోరిక ఎవరైనా కలిగి ఉండే అవకాశం ఉంది. కానీ, ఖురాను గ్రంథంలోనైతే మానవాళి శాశ్వత సాఫల్యానికి తప్పనిసరి అయిన జ్ఞానానికి చెందిన సమాచారం మాత్రమే ఉంది. అటువంటప్పుడు వారి ఆ కోరిక ఈ వాస్తవాన్ని మార్చజాలదు కదా!